క్లుప్తంగా

ఆలయంలో భజన



కాటారం: శ్రావణమాసాన్ని పురస్కరించుకొని కాటారం మండల కేంద్రంలోని శ్రీభక్తాంజనేయ స్వామి ఆలయంలో శనివారం ఎక్కాం భజన కార్యక్రమం నిర్వహించారు. హనుమాన్ చాలీసా, దండక పారాయణంతో పాటు భక్తి పాటలు పాడారు. అంతకుముందు ఆలయ పురోహితులు నిఖిల్‌శాస్త్రి స్వామి వారికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ గౌరవ అధ్యక్షుడు మద్ది నవీన్, అధ్యక్షుడు చీర్ల శ్రావణ్, సభ్యులు బీరెల్లి అంజయ్య, గౌని జగదీశ్, పులి అశోక్, పెండ్యాల శ్రీరాములు, మద్ది సూరిబాబు, భజనా మండలి సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ



మహదేవపూర్: మండల కేంద్రంలోని జాతీయ రహదారిపై బొమ్మాపూర్ క్రాస్ వద్ద శనివారం సీఐ కిరణ్ ఆధ్వర్యంలో వాహనాల తనిఖీ చేపట్టారు. వచ్చి వెళ్లే ప్రతీ వాహనాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు. ఎస్సైరాజ్‌కుమార్, కానిస్టేబుళ్లు ధనుంజయ్, అన్వేష్, అరుణ్, తిరుపతి, తదితరులు పాల్గొన్నారు.

రేపు సర్వసభ్య సమావేశం

మహాముత్తారం: మండల కేంద్రంలో పీఏసీఎస్ సర్వసభ్య సమావేశం ఈనెల 11న నిర్వహించనున్నట్లు సీఈఓ మార్క శ్రీధర్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 11గంటలకు సమావేశం ప్రారంభం అవుతుందని సంఘ సభ్యులు, రైతులు సకాలంలో హాజరు కావాలని కోరారు.

'అనుచిత వ్యాఖ్యలు సరికాదు'

భూపాలపల్లి రూరల్: ఎల్లప్పుడూ ప్రజల్లో ఉండే ఎమ్మెల్యే సీతక్కపై బీఆర్‌ఎస్ నాయకులు అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదని కాంగ్రెస్ పార్టీ మండల అధికార ప్రతినిధి పేర్కొన్నారు. శనివారం భూపాలపల్లి మండలంలోని గుర్రంపేట గ్రామంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. సీతక్క నియోజకవర్గ అభివృద్ధికి ఎనలేని కృషి చేస్తుంటే ఓర్వలేని బీఆర్‌ఎస్ నాయకులు ఇష్టానుసారంగా మాట్లాడుతున్నారన్నారు. నిత్యం ప్రజలతో మమేకమై ప్రజలకు సేవ చేస్తున్న సీతక్కపై పోటీ చేస్తున్న నాయకులకు డిపాజిట్లు దక్కయన్నారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు కుమారస్వామి, ఉస్మాన్, రాజు, సమ్మయ్య, రాజమొగిలి, గోవింద్ తదితరులు ఉన్నారు.

'బాధితులను ఆదుకోవడంలో విఫలం'

ములుగు రూరల్ : ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ఇళ్లలోని సామగ్రి, పంటలు నష్టపోయిన వరద బాధితులను ఆదుకోవడంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం విఫలమైందని ములుగు ఎమ్మెల్యే సీతక్క విమర్శించారు. గోవిందరావుపేట మండలంలోని సోమల్లగడ్డ, లక్ష్మీపురం, రంగాపూర్ గ్రామాల్లోని వరద బాధితులకు నెస్టీల, జేసీఐ స్వచ్ఛంద సంస్థల సహకారంతో శనివారం ఆమె సరుకులు, ఇతర చేయూత అందించారు. ఈ సందర్భంగా సీతక్క మాట్లాడారు. భారీ వర్షాల నేపథ్యంలో పలువురు ఇంళ్లు, సామగ్రి, తదితరాలు నష్టపోయినట్లు తెలిపారు. అయినప్పటికీ వరద బాధితులకు సాయం అందించకుండా రాష్ట్ర ప్రభుత్వం చోద్యం చూస్తోందని మండిపడ్డారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి వరదలతో నష్టపోయిన ప్రజలకు, పంటలు దెబ్బతిన్న రైతులకు వెంటనే పరిహారం అందించి ఆదుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ విషయంలో బాధితులను ఆదుకునే దిశగా అధికార యంత్రాంగం చొరవ చూపాలని ఆకాంక్షించారు. నియోజకవర్గ ప్రజలందరికీ తాను అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, సీతారాంనాయక్, ఎల్లారెడ్డి, సుధాకర్, శ్రీకాంత్, సోమయ్య, జనార్దన్‌రెడ్డి, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

అసైన్డ్ భూములు ఇవ్వాలి

వెంకటాపురం (కె) : మండలంలోని దానవాయిపేట గ్రామంలోని అసైన్డ్ భూములను తక్షణమే సర్వే చేసి ఆదివాసీలకు ఇవ్వాలని ఆదివాసీ నాయకుడు పూనెం సాయి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. దానవాయిపేటలో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్య, వైద్యం, ఉద్యోగ, ఉపాధి, ఇతర అన్ని రంగాల్లోనూ ఆదివాసీలు తీవ్ర వెనుకబాటుకు గురవుతున్నారని ఆందోళన వెలిబుచ్చారు. ఆదివాసీ చట్టాల అమలు కోసం సీనియర్ ఐఏఎస్ అధికారితో కమిటీ ఏర్పాటు చేయాలని, ఏజెన్సీలో ఆదివాసీ చట్టాలను సమర్థవంతంగా అమలు చేయాలని, ఆదివాసీల సాగులో ఉన్న భూములకు రక్షణ కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు నర్సింహారావు, బుల్లి, సత్తెమ్మ, నారాయణ, సమ్మక్క, నరేష్ పాల్గొన్నారు.

భూపాలపల్లి రూరల్: కాళోజీ జయంతి వేడుకల్లో గండ్ర సత్యనారాయణరావు



మొగుళ్లపల్లిలో..



చిట్యాలలో..



కాళోజీ సేవలు మరువలేనివి



భూపాలపల్లి అర్బన్: కాళోజీ చిత్రపటానికి పూలమాల వేస్తున్న నాయకులు

భూపాలపల్లి అర్బన్: సాహిత్య రంగంలో కాళోజీనారాయణరావు చేసిన సేవలు మరువలేనివని తెలుగు భాషాభ్యాసన అభివృద్ధి సమితి జిల్లా కన్వీనర్ బైరి నరసింహస్వామి, ఏఎంఓ కాగిత లక్ష్మణ్ అన్నారు. తెలుగు భాషాభ్యాసన అభివృద్ధి సమితి జిల్లా శాఖ ఆధ్వర్యంలో స్థానిక చైతన్య మహిళా డిగ్రీ అండ్ పీజీ కళాశాల అవరణంలో కాళోజీ నారాయణరావు జయంతి వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాళోజి చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కో–కన్వీనర్లు సురేష్, రాములు, ప్రతాప్, నాయకులు రాజబాబు, కట్టి స్వామి, రాంసింగ్, లక్ష్మయ్య, కష్టయ్య, సురేందర్, మొగిలి, సంజీవ్ రావు, గోవర్దన్ పాల్గొన్నారు.

భూపాలపల్లి రూరల్: రాష్ట్రంలో కాళోజీ సిద్ధాంతాలను అమలు చేయాలని టీపీసీసీ సభ్యుడు, నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ గండ్ర సత్యనారాయణరావు అన్నారు. శనివారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కాళోజీ జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా కాళోజీ చిత్రపటానికి పూలమాలవేసి ఘన నివాళులర్పించారు. అనంతరం సత్యనారాయణరావు మాట్లాడుతూ.. సాహిత్య రంగంలో కాళోజీ చేసిన సేవలు ఎన్నటికీ మరువలేనివన్నారు. నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

మొగుళ్లపల్లి: మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ ఆవరణలో, ఎంజేపీ పాఠశాలలో, సమాచార హక్కు చట్టం ఆధ్వర్యంలో శనివారం తెలంగాణ భాషాదినోత్సవం, కాళోజీ నారాయణరావు జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాళోజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ యార సుజాతసంజీవరెడ్డి, జెడ్పీటీసీ జోరుక సదయ్య, సర్పంచ్ మోటె ధర్మారావు, ఎంపీటీసీ ఎర్రబెల్లి వనితపున్నంచందర్‌రావు, ఎంజేపీ పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చిట్యాల: పద్మ విభూషణ్.. కాళోజీ నారాయణరావు జయంతి ఉత్సవాలను శనివారం మండల కేంద్రంలో అంబేడ్కర్ యువజన సంఘం రాష్ట్ర నాయకుడు పుల్ల మల్లయ్య ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాళోజీ చిత్రపటానికి పూలమాలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో



మొగుళ్లపల్లి: ఎంజేపీ పాఠశాలలో..

జిల్లా కార్యదర్శి గుర్రపు రాజేందర్, నాయకులు జన్నె యుగేందర్, పుల్ల ప్రతాప్, గుర్రం తిరుపతి, గురుకుంట్ల కిరణ్, కట్కూరి రాజేందర్, మైదం శ్రీకాంత్, నర్సింహారాములు, రవి, సరోత్తం తదితరులు పాల్గొన్నారు.

ప్రజలను మోసం చేస్తున్న ప్రభుత్వం



నిరసన కార్యక్రమంలో సీపీఎం నాయకులు, గ్రామస్తులు

కాటారం: కేంద్ర ప్రభుత్వం దేశంలో ప్రజావ్యతిరేక విధానాలను అవలంభిస్తూ ప్రజలను మోసం చేస్తుందని సీపీఎం జిల్లా కార్యదర్శి పొలం రాజేందర్ ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వ తీరును నిరసిస్తూ కాటారం మండలం దంతలపల్లిలో సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజేందర్ మాట్లాడుతూ.. దేశంలో రోజు రోజుకు నిత్యావసర సరుకుల ధరలకు హద్దు అదుపు లేకుండా పోతుందని కట్టడి చేయడంలో బీజేపీ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. దేశంలో కోట్ల మంది ప్రజలు పేదరికంలో మగ్గుతున్నారని గ్యాస్, బియ్యం ధరలు అమాంతం పెరిగిపోయాయని పేర్కొన్నారు. అలాగే రాష్ట్రంలో ఆదివాసీ గిరిజనులకు, పోడు రైతులకు 11 లక్షల 50 వేల ఎకరాలకు పోడు పట్టా ఇస్తానని ప్రగల్భాలు పలికిన రాష్ట్ర ప్రభుత్వం 4 లక్షల ఎకరాలకు మాత్రమే పట్టాలు ఇచ్చి మోసం చేసిందని విమర్శించారు. పోడు జాబితాలో చేర్చని గ్రామాలు అనేకం ఉన్నాయని అనేక మంది పోడు రైతులకు అన్యాయం జరుగుతోందని తెలిపారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికలకు ముందే పరిష్కరించాలని లేకుంటే పెద్ద ఎత్తున సమరశీల పోరాటాలకు సిద్ధం అవుతామని హెచ్చరించారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పోలం చిన్నరాజేందర్, ఆకుల లలిత, రాజు, సమ్మయ్య, రమ పాల్గొన్నారు.

సన్మానం



మధుకర్‌ను సన్మానిస్తున్న నాయకులు

మహదేవపూర్: బీఆర్‌ఎస్‌పార్టీ మథని ఎమ్మెల్యే అభ్యర్థిగా ప్రకటించిన తర్వాత మండలానికి వచ్చిన పుట్ట మధును శనివారం నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు లింగంపల్లి శ్రీనివాసరావు, రాష్ట్ర యువజన నాయకుడు జక్కు రాకేష్, కాటారం మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ పెండ్యల మమత, సర్పంచ్ శ్రీపతిబాపు, మహిళ అధ్యక్షురాలు కేదారి గీతబాయి, కాళేశ్వరం దేవస్థాన డైరెక్టర్ కుంభం పద్మ, సినియర్ నాయకులు అన్కారి ప్రకాశ్, మనోహర్, అలీమ్, కిరణ్, తిరుపతిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలో మాక్‌పోలింగ్



ఎన్నికల్లో గెలుపొందిన విద్యార్థులు

భూపాలపల్లి అర్బన్: జిల్లా కేంద్రంలోని సన్‌వ్యాలీ హైస్కూల్‌లో శనివారం మాక్ పోలింగ్ నిర్వహించి ఎన్నికల నిర్వహణపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. భారతదేశంలోని ప్రజాస్వామ్య, ప్రజాస్వామ్య భావన, ఎన్నికల ఆవశ్యకతను విద్యార్థులకు వివరించినట్లు పాఠశాల డైరెక్టర్లు మేనం సతీష్‌కుమార్, మైనాల సురేష్ తెలిపారు.

రానున్నది కాంగ్రెస్ ప్రభుత్వమే



పార్టీలోకి ఆహ్వానిస్తున్న సత్యనారాయణరావు

భూపాలపల్లి రూరల్: కేంద్రంలో, రాష్ట్రంలో రానున్నది కాంగ్రెస్ ప్రభుత్వమే అని పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గండ్ర సత్యనారాయణరావు అన్నారు. పార్టీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బీజేపీ, బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు శనివారం కాంగ్రెస్‌లో చేరారు. వీరికి సత్యనారాయణరావు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో కాసీంపల్లి నుంచి బీజేపీ అర్బన్ మెర్నా అధ్యక్షురాలు కడారి మాలతి, ఫకీర్‌గడ్డ నుంచి జంబోజు పద్మావతి, అంగిడి వసుమతి, రేగొండ మండలం తిరుమలగిరి గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ వార్డు సభ్యులు ఇండ్ల శశిధర్, పాలడుగుల రజిత–స్వామి, ఇండ్ల శశిధర్ ,పాలడుగుల సుమన్‌తో పాటు పలువురు పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు పాల్గొన్నారు.

నియామకం



భూపాలపల్లి రూరల్: ఎస్సీ ఎస్టీ వర్కింగ్ జర్నలిస్ట్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా జిల్లా కేంద్రానికి చెందిన తిక్క ప్రవీణ్‌ను నియమించినట్లు ఆ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మంతెన సమ్మయ్య తెలిపారు. ఈ మేరకు శనివారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో నియామక పత్రం అందజేశారు. అనంతరం తిక్క ప్రవీణ్ మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో జిల్లా అధ్యక్షుడిగా నియమించిన రాష్ట్ర ఉపాధ్యక్షుడు మంతెన సమ్మయ్యకు, సహకరించిన రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు మారపల్లి మల్లేష్, బందెల రాజశేఖర్, జిల్లా నాయకులు ఎర్రం సతీష్ కుమార్, చెరుకు సుధాకర్‌లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు మోకిడి చిరంజీవి, కోశాధికారి కడపాక రవి, అధికార ప్రతినిధి రడపాక రమేష్, ముఖ్య సలహాదారులు అకుదారి సత్యనారాయణ, మధు తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండండి



పరీక్షలు చేస్తున్న డాక్టర్ నిఖిల్‌కుమార్, సిబ్బంది

మంగపేట : సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని బ్రాహ్మణపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి నిఖిల్‌కుమార్ కోరారు. మండలంలోని రామచంద్రునిపేటలో శనివారం ర్యాపిడ్ ఫీవర్ సర్వే నిర్వహించారు. పంచాయతీ కార్యదర్శి సంపత్‌తో వైద్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి పరిసరాలను పరిశీలిస్తూ ప్రజల ఆరోగ్యంపై అడిగి తెలుసుకున్నారు. అనంతరం డాక్టర్ నిఖిల్‌కుమార్ మాట్లాడారు. దోమలు, ఈగల కారణంగా గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందన్నారు. గ్రామాల్లో కొద్ది రోజులుగా జ్వరాలు ప్రబలుతున్న క్రమంలో ర్యాపిడ్ ఫీవర్ సర్వే చేపట్టినట్లు తెలిపారు. సీజనల్ వ్యాధుల బారిన పడకుండా ప్రతిఒక్కరూ వ్యక్తిగత, పరిసరాల శుభ్రత పాటించాలని సూచించారు. వర్షపు, మురుగునీరు నిల్వకుండా జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. పీహెచ్‌సీలో రక్త, మూత్ర, మలేరియా, టైఫాయిడ్, డెంగ్యూ, తదితర అన్ని పరీక్షలు అందుబాటులో ఉన్నాయని వివరించారు.

బియ్యం అందజేత



బియ్యం అందజేస్తున్న నాయకులు

టేకుమట్ల: మండలంలోని గర్మిళ్లపల్లి శివారు కలికోట గ్రామానికి చెందిన కొలాని అశోక్ ఇటీవల ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్య చేసుకున్నాడు. దీంతో బాధిత కుటుంబాన్ని తెలంగాణ నిర్మాణ పార్టీ 7200 తీన్మార్ మల్లన్న టీం అధ్యక్షుడు రవిపటేల్ పరామర్శించి 25 కిలోల బియ్యాన్ని అందజేశారు. ఆయన వెంట జిల్లా, మండల నాయకులు గండు కరుణాకర్, విష్ణు, పుష్పాల శ్రీను, పిట్టల వెంకటేష్, వర్ధన్, అఖిల్, అక్షయ్, నాగరాజు, సారయ్య, సదయ్య, శ్రీనివాస్, తదితరులు ఉన్నారు.

ఐక్యపోరాటాలతోనే ఉద్యోగ అవకాశాలు

ఏటూరునాగారం : ఐక్యపోరాటాలతోనే ఉద్యోగ, ఉపాధి అవకాశాలు సాధించుకోగలమని ఆదివాసీ ఉద్యోగుల సంఘం జేఏసీ కన్వీనర్లు చౌలం వెంకటేష్, మైపతి సంతోష్ స్పష్టం చేశారు. మండల కేంద్రంలోని గిరిజన భవన్‌లో ఐటీడీఏ పరిధిలోని వివిధ ప్రభుత్వ శాఖల్లో పని చేస్తున్న ఉద్యోగులు, నిరుద్యోగులతో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో వెంకటేష్, సంతోష్ మాట్లాడారు. ఐటీడీఏలోని 29 శాఖల్లో నూరు శాతం రిజర్వేషన్ అమలు చేస్తూ ఉద్యోగ ఖాళీలను భర్తీ చేయాల్సిన బాధ్యతను ప్రభుత్వం విస్మరిస్తోందని విమర్శించారు. జీఓ నంబర్ 57 ప్రకారం ఐటీడీఏ పరిధిలోని 14 మండలాల్లో సింగిల్ లైన్ అడ్మిస్ట్రేషన్ అమలులో ఉందని చెప్పారు. సమావేశంలో నాయకులు ఎట్టి వేణుగోపాల్, వంక నరేష్, పెనుక ప్రభాకర్, అరుణ్, మహేష్, బందాల సారయ్య పాల్గొన్నారు.

ఇసుక లారీలతో దెబ్బతింటున్న రోడ్లు



కాటారం: రహదారిని చూపిస్తున్న నాయకులు

చిట్యాల: టేకుమట్ల మండలంలోని ఇసుక క్వారీ నుంచి చిట్యాల మండల కేంద్రం మీదుగా వందలాది ఇసుక లారీలు పరకాల వైపు పోవడం మూలంగా తారు రోడ్డు మొత్తం అధ్వానంగా తయారైందని దీంతో ప్రయాణికులు అనేక అవస్థలు పడుతున్నారని సీపీఐ ఎంఎల్ జిల్లా కార్యదర్శి మారపెల్లి మల్లేష్ పేర్కొన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ.. పరకాల నుంచి వచ్చే బస్సులు రోడ్డు సౌకర్యం సరిగా లేక పోవడంతో దిగబడి పోతున్నాయని అన్నారు. అలాగే ద్విచక్ర వాహనాలపై వెళ్లే ప్రయాణికులు అనేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఎమ్మెల్యే ప్రజలు పడుతున్న పరిస్థితిని గమనించి రోడ్డుకు మరమ్మతులు చేపట్టాని కోరారు.

కాటారం: ఇసుక లారీల రాకపోకలతో ధ్వంసమైన కాటారం మీదుగా భూపాలపల్లి, హనుమకొండ వెళ్తున్న జాతీయ రహదారి 353(సీ)కి వెంటనే మరమ్మతులు చేపట్టాలని ప్రజా సంఘాల నాయకులు పీక కిరణ్, అక్కల బాపు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని ప్రధాన కూడలిలో ధ్వంసమైన రహదారిని శనివారం వారు పరిశీలించి అనంతరం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. కాళేశ్వరం నుంచి హనుమకొండ, మంథని వైపుగా నిత్యం అధికలోడ్‌తో ఇసుక లారీలు వెళ్తుండటంతో ప్రధాన రహదారి అస్తవ్యస్తంగా తయారైందని ఆరోపించారు. రహదారులు పూర్తిగా కుంగిపోవడంతో ద్విచక్రవాహనదారులు అదుపుతప్పి పడిపోయి ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారని పేర్కొన్నారు. ఇసుక దందా కారణంగా కోట్లాది రూపాయలతో నిర్మించిన రోడ్లు చిద్రం అయిపోతున్న ప్రభుత్వం, స్థానిక ఎమ్మెల్యే పట్టించుకోవడం లేదని విమర్శించారు. ఇసుక క్వారీల లైసెన్స్‌లు రద్దు చేసి ఇసుక రవాణాను అరికట్టాలని తెలిపారు. రహదారులకు తక్షణమే మరమ్మతు చర్యలు చేపట్టి ప్రమాదాలను అరికట్టాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో నాయకులు మంథెన రాజబాబు, జాడి నాగయ్యతో పాటు తదితరులు పాల్గొన్నారు.

రహదారికి మరమ్మతు చేయించాలి



రోడ్డును పరిశీలిస్తున్న నాయకులు

మొగుళ్లపల్లి: వరదలతో దెబ్బతిన్న రహదారులకు మరమ్మతు చేయించాలని కాంగ్రెస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి రాము ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో ధ్వంసమైన రహదారులను కాంగ్రెస్ నాయకులు శనివారం పరిశీలించారు. అనంతరం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. మండలంలోని ములకలపల్లి–కొర్కిశాల, మొగుళ్లపల్లి–చిట్యాల మండలం నవాబుపేట గ్రామాల మధ్య భూపాలపల్లికి వెళ్లే ప్రధాన రోడ్లు, పెద్దవాగు బ్రిడ్జి సమీపంలో రివిట్ మెంట్ వరదలతో తెగి 40 రోజులు దాటిన మరమ్మతు పనులకు ఎలాంటి చర్యలు చేపట్టలేదని ఆరోపించారు. ప్రమాద సూచిక బోర్డులు ఏర్పాటు చేయకపోవడంతో నిండు ప్రాణాలు యాక్సిడెంట్ రూపంలో పోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు ప్రమాద నివారణ చర్యలు చేపట్టి రోడ్లపై ప్రయాణించే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తక్షణమే సహాయక చర్యలు చేపట్టేలా చూడాలని కలెక్టర్‌ను కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు క్యాతరాజు రమేష్, మల్సాని రాజేశ్వర్ రావు, పడిదల ప్రకాశ్ రావు, నీరటి మహేందర్ పాల్గొన్నారు.

ఓసీపీ నీళ్లు మళ్లించాలని ఆందోళన



ఆందోళన చేస్తున్న రైతులు

మల్హర్: మండలంలోని తాడిచర్ల ఓపెన్‌కాస్ట్(ఓసీపీ) నీళ్ల మళ్లించాలని శనివారం రైతులు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. ఊరచెరవు శివారులో తమ పంట పొలాలకు ఓపెన్‌కాస్ట్ ప్రాజెక్టు సంబంధిన వరద నీరు తలించడం మూలంగా పొలాల్లో తెల్ల మేరం పేరుకపోయి పూర్తిగా నాశనమవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో వర్షాలు కురిసిన సమయంలో వచ్చిన వరద పొలాల్లో నిల్వకుండా వెళ్లిపోయేవన్నారు. ప్రస్తుతం నిత్యం ప్రాజెక్టు నీళ్ల పొలాలకు చేరుకోని అందుగా పేరుకపోయి అక్కడే నిలస్తున్నాయని తెలిపారు. ఇప్పటికై నా ఏఎమ్మార్ అధికారులు స్పందించి నష్టపోయిన రైతులకు పరిహారం అందించడంతో పాటు పొలాల్లో నీరు రాకుండా శాశ్వత పరిష్కారం చూపాలని రైతులు కోరారు.

గుడుంబా స్థావరాలపై దాడులు



బెల్లం పానకాన్ని పారబోస్తున్న పోలీసులు

టేకుమట్ల(రేగొండ): రేగొండ మండలంలోని రేపాకలో గుడుంబా స్థావరంపై దాడులు నిర్వహించి గుడుంబాను స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ ఎస్సై మాన్‌సింగ్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. రేపాక గ్రామానికి చెందిన గొల్లెన రఘు అక్రమంగా గుడుంబాను తయారు చేస్తున్నారనే సమాచారం మేరకు శనివారం ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ ఆధ్వర్యంలో దాడులు నిర్వహించినట్లు తెలిపారు. ఈ దాడుల్లో 4లీటర్ల గుడుంబాతో పాటు 500లీటర్ల పానకాన్ని గుర్తించినట్లు తెలిపారు. గుడుంబాను స్వాధీనం చేసుకుని, పానకాన్ని ధ్వంసం చేసి, నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు. ఆయన వెంట కానిస్టేబుళ్లు విష్ణువర్ధన్, విజయ్, అలీ ఉన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ



చిట్యాల: పరామర్శిస్తున్న జెడ్పీటీసీ సాగర్

చిట్యాల: ఇటీవల పిడుగు పాటుకు గురై ఎంజీఎంలో చికిత్స పొందుతున్న మండల కేంద్రంలోని రాంనగర్ కాలనీకి చెందిన మైదం ఉమా, పర్లపెల్లి భద్రమ్మ, అలాగే అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స పొందుతున్న ముత్తారం గ్రామానికి చెందిన సుద్దపల్లి సతీష్‌లను జెడ్పీటీసీ గొర్రె సాగర్ శనివారం పరామర్శించారు. ఆయన వెంట బీఆర్‌ఎస్ మండల అధ్యక్షులు ఆరెపల్లి మల్లయ్య ఉన్నారు.

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం మద్దులపల్లి గ్రామానికి చెందిన బాల్నె చిన్న బాపురెడ్డి ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. దీంతో బాధిత కుటుంబాన్ని పెద్దపల్లి జెడ్పీచైర్మన్, నియోజకవర్గ బీఆర్‌ఎస్ పార్టీ ఇన్‌చార్జ్ పుట్ట మధుకర్ శనివారం పరామర్శించారు.